నేటి దినపత్రిక
సూర్య
కర్నూలు | నంద్యాల
శుక్రవారం | 01 మార్చి 2024 పేజీలు 8

- జగన్ సమక్షంలో పార్టీలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్
- కర్నూలు అభ్యర్థిగా నేడో, రేపో ప్రకటించే అవకాశం

## వైసీపీలో చేరిన ఇంతియాజ్


సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ఇంతియాజ్

కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి: సీనియర్ ఐఏఎస్ అధికారి ఎఎండి. ఇంతియాజ్ వైసీపీలో చేరారు. బుధవారమే తన పదవికి స్వచ్ఛంత విరమణ చేసిన ఆయన గురువారం వైసీపీలో ముఖ్య నాయకుల సమక్షంలో చేరారు. ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయంలో వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ మిగతా 2లో

## కోట్ల వర్సెస్ బుగ్గన


బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ఆసక్తికరంగా మారిన డోన్ రాజకీయం
- రాష్ట్రాన్ని ఆకర్షిస్తోన్న డోన్
- బుగ్గనను ఓడించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న తెదేపా
- అభివృద్ధి గెలిపిస్తుందన్న ధీమాతో బుగ్గన
- నేడు డోన్‌కు వెళ్తున్న కోట్ల

2లో


కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి



జీడీపీ నుండి

## కర్నూలుకు తాగునీరు

- జి.సింగవరం వద్ద నీటికి పూజలు చేసిన కమిషనర్
- 70 కిలోమీటర్ల దూరం నుండి తాగునీరు

కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో : కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సుంకేసుల బ్యారేజ్‌లో నీరు అడుగంటి పోవడంతో ప్రత్యామ్నాయంగా గాజులదిన్నె ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడం మిగతా 2లో

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు

## ముస్తాబైన శ్రీశైలం



- నేటి నుంచి శ్రీగిరిపై మల్లన్న బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలి రానున్న భక్తులు
- సర్వం సిద్ధం చేసిన శ్రీశైల దేవస్థానం
- 11 రోజులు స్వామి అమ్మవార్లకు విశేష వాహనసేవలు, గ్రామోత్సవం
- 8న పాగాలంకరణ, కల్యాణోత్సవం
- నేడు శ్రీకాళహస్తి దేవస్థానం వారిచే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పణ

7లో

## ఫలించిన 'శిల్పా' వ్యూహం

- దేశం సైలెంట్... ఆపై నిష్క్రమణ
- అక్రమాలపై గళమెత్తిన కౌన్సిలర్లు
- రెపరెపలాడిన 'సూర్య'
- కౌన్సిల్ సాక్షిగా అక్రమాలపై గళం విప్పిన చైర్‌పర్సన్
- మున్సిపల్ స్థలాలను కాపాడుకుంటాం
- లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా

2లో


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా



# కోట్ల వర్సెస్ బుగ్గన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని డోన్ రాజకీయం అత్యంత ఆసక్తికరంగా మారింది. 2024 ఎన్నికల్లో ఇక్కడి నుండి ఇద్దరు అతిరథులు రంగంలోకి దిగుతున్నారు. వీరిద్దరూ తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకోబోతున్నారు. ఇద్దరికీ ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకం కాబోతున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా వరుస విజయాలు సాధించి తాజా రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక శాఖ నిర్వహిస్తోన్న బుగ్గన రాజేంద్రనాథ్ మరోమారు 2024 ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గం నుండి పోటీ చేయబోతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాజకీయంగా బలమైన నేతగా గుర్తింపు పొందిన కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి తొలిసారి డోన్ నియోజకవర్గం నుండి తెదేపా అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో బరిలోకి దిగబోతున్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఒక్కసారి మాత్రమే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కోట్ల సూర్య కర్నూలు పార్లమెంట్ స్థానం నుండి ఎక్కువసార్లు పోటీ చేశారు. 2024 ఎన్నికల్లోనూ ఎంపి అభ్యర్థిగా బరిలోకి దిగాలన్న ఆలోచనతో ఉన్న ఆయనను డోన్ నుండి పోటీ చేయించాలని తెదేపా అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ అధినాయకత్వ నిర్ణయాన్ని గౌరవించి డోన్ శాసనసభ స్థానానికి ఆయన పోటీ చేయబోతున్నారు. ఇందులో భాగంగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నేడు డోన్‌కు వెళుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా తమ వారిని రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ ఐదేళ్లుగా వేధించార ని ఆ పార్టీ అధిష్టానం ఆయనపై ఆగ్రహంగా ఉంది. బిల్లుల కోసం కోర్టులకు కూడా వెళ్లాల్సి రావడాన్ని ఆ పార్టీ పలు సందర్భాల్లో బహిరంగంగానే చెప్పుకుంది. బిల్లుల చెల్లింపు కోసం పార్టీ ఒక ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేసి న్యాయ పోరాటం చేసింది. ఇంకా అనేక రకాలైన కారణాలతో బుగ్గనను తెదేపా అధిష్టానం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ కారణంగానే 2024 ఎన్నికల్లో బుగ్గనను ఎలాగైనా ఇంటికి సాగనంపాలన్న లక్ష్యంతో ఉన్న తెదేపా అధిష్టానం ఆయనను ఓడించే సత్తా కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డికే ఉందన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దివంగత కోట్ల విజయభాస్కరరెడ్డి లాగానే మచ్చలేని నాయకుడిగా కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి ఉన్న పేరు డోన్‌లో బాగా కలిసి వస్తుందన్నది తెదేపా అంచనాగా కనిపిస్తోంది. అంతే కాకుండా డోన్ నియోజకవర్గంపై కోట్ల కుటుంబానికి ఉన్న పట్టు కూడా బుగ్గనను ఓడించేందుకు సరిపోతుందన్నది తెదేపా అధిష్టానం లెక్కలు కట్టినట్లు తెలుస్తోంది. 10 సంవత్సరాలుగా కోట్ల కుటుంబం డోన్ నియోజకవర్గానికి దూరంగా ఉండడం కారణంగా వైకాపాలోకి వెళ్లిన ఆయన వర్గమంతా తిరిగి సొంత గూటికి చేరుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే డోన్ నియోజకవర్గంలో మంచి పట్టున్న కెఇ కుటుంబం కూడా కోట్ల విజయానికి సంపూర్ణంగా సహకరిస్తుందని, ఇది కోట్లకు అతి పెద్ద విజయాన్ని సాధించి పెట్టడం ఖాయమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కోట్ల, కెఇ కుటుంబాలు కలిసి పని చేస్తే కోట్లకు ఘనవిజయం, బుగ్గనకు రాజకీయ పరాభవం తప్పదని ఆయా వర్గాలు ఊహిస్తున్నాయి. బుగ్గన ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నా సొంత మండలం బేతంచెర్లలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్ట పోయిన చందాన ఆయన పార్టీ సాధించిన విజయాన్ని తెదేపా వర్గాలు గుర్తు చేస్తున్నాయి. డోన్ నియోజకవర్గ వైకాపాలో కీలకమైన నేతలంతా బుగ్గన తీరుపై అసంతృప్తితో ఉన్నారన్న వార్తలు అందుతున్న నేపథ్యంలో అదే నిజమైతే కోట్ల విజయం నల్లేరు మీద నడక లాంటిదేననడంలో సందేహం లేదు.

రాష్ట్ర ఆర్థిక మంత్రిగా కీలకమైన స్థానంలో ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ ఈ ఐదేళ్లలో డోన్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. మన డోన్ - మన అభివృద్ధి - మన బుగ్గన అంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. డోన్ నియోజకవర్గంలో ఎక్కడకు వెళ్లినా ఇలాంటి ఫ్లెక్సీలు మనకు కనిపిస్తాయి. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి 2,500 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆయన పదే పదే చెప్పుకుంటున్నారు. 100 పడకల ఆసుపత్రి, హాస్టళ్లు, కళ్యామండపాలు, మార్కెట్ ఆధునికీకరణ, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు, కొత్తగా అనేక రోడ్ల నిర్మాణాలు, ఆర్టీసి బస్టాండ్ల ఆధునికీకరణ లాంటివి తాను తెచ్చానని, ఇవన్నీ ప్రజల క ళ్ల ముందు కనిపిస్తున్నాయని బుగ్గన చెబుతున్నారు. ఇవన్నీ చెప్పుకునేందుకు బాగానే ఉన్నా వైకాపా వర్గాలు మాత్రం ఆయన తమకు దూరంగా ఉంటున్నారని, తమను దూరంగా పెట్టడమే తన పని అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆయా వర్గాలు కినుక ప్రదర్శిస్తున్న మాట అక్షరాలా నిజం. బేతంచర్ల మునిసిపల్ ఎన్నికల ఫలితాలే వైకాపా వర్గాలు ఆయనను వ్యతిరేకిస్తున్నాయన్నది స్పష్టం చేశాయి. కానీ ఈ పదేళ్లలో ఆయన డోన్ నియోజకవర్గంపై అవసరమైనంత పట్టు సంపాదించారు.

ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే రెండు నెలల్లో జరగనున్న ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. జిల్లాలోనే అతి పెద్ద రాజకీయ కుటుంబానికి ప్రతినిధి అయిన కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుగ్గన రాజేంద్రనాథ్ మధ్య జరగనున్న ఎన్నికలు ఎలాంటి ఫలితాలనిస్తాయన్నది పక్కన పెడితే వీరిద్దరి మధ్య జరగబోయే ఎన్నికల యుద్ధం మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించడం ఖాయం.

## వైసీపీలో చేరిన ఇంతియాజ్

(మొదటిపేజీ తరువాయి)

రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బి.వై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలతో సీఎంను కలిశారు. ఆయనకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సెర్ప్ సీఈవో విధులు నిర్వహిస్తున్న ఇంతియాజ్ బుధవారమే స్వచ్ఛంద పదవి విరమణ చేసిన అనంతరం వైసీపీలో చేరడం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కర్నూలు వైసీపీ అభ్యర్థిగా ఇంతియాజ్ పేరు వైసీపీ అధినేత జగన్ పరిశీలిస్తున్నట్లు దాదాపు ఆయన అభ్యర్థిత్వాన్ని నేడో, రేపో ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

## మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయండి

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ఏపీ జేఏసీ మహిళా శాఖ నిరంతర కృషి చేయాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఏపీ జేఏసీ మహిళా శాఖ ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా మహిళా విభాగపు జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన మల్లీశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి షేక్‌ముంతాజ్‌బేగంను ఘనంగా సత్కరించారు.



జిల్లా జడ్జికి పుష్పగుచ్చం అందజేస్తున్న దృశ్యం

## జీడీపీ నుండి కర్నూలుకు తాగునీరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైంది. నగరానికి 70 కిలోమీటర్ల దూరంలోని జీడిపి నుండి సోమవారం నీటిని విడుదల చేశారు. ఆ నీరు గురువారం కర్నూలు నగర శివార్లలోని జి.సింగవరం చేరుకుంది. ఈ సందర్భంగా నగర కమిషనర్ కె.భార్గవ నీటి కి పూజలు చేసి, హార తులిచ్చి నీటికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిఇఇ రవిప్రకాష్‌నాయుడు, ఏఇ జనార్ధన్, ప్రవీణ్ తదిత రులు పాల్గొన్నారు. 6లక్షలకు పైగా జనాభా ఉన్న కర్నూలు నగరానికి సుంకేసుల బ్యారేజ్ నుండి మంచినీరు సరఫరా అవుతోంది. తుంగభద్ర డ్యాం నుండి సుంకేసుల చేరుకునే నీటిని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌కు మళ్లించుకుని అక్కడి నుండి పంప్‌హౌస్‌కు తీసుకుని నగర ప్రజల దాహార్తి తీరుస్తున్నారు కెఎంసి అధికారులు. 1.2 టిఎంసిల నీటి సామర్థ్యం ఉన్న సుంకేసుల బ్యారేజ్ ఈ ఏడాది వర్షాభావ కారణంగా దాదాపు అడుగంటిపోయింది. ఎస్ఎస్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీరు కూడా మరో నెల రోజులకు మించి రాని పరిస్థితి ఉండడంతో ప్రత్యామ్నాయంగా జీడీపీ నుండి నీటిని మళ్ళించుకోవడం ఒక్కటే మార్గంగా భావించారు. 2001లోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది. అప్పుడు తొలిసారిగా జీడీపీ నుండి కర్నూలుకు తాగునీటిని మళ్లించారు. ఆ తర్వాత ఒకట్రెండు సంవత్సరాలు ఇదే పరిస్థితి కొనసాగినా ఆ తర్వాత జీడీపీ నుండి నీటిని మళ్లించుకోవలసిన అవసరం కర్నూలు నగరానికి రాలేదు. నగర ప్రజల తాగునీటికి అవసరమైన నీటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు లేకపోయినా, అందుబాటులో ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో నెల లేదా రెండు నెలల పాటే నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిసినా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాల్సిన అధికారులు, పాలకపక్షం నిర్లక్ష్యం చూపించిన ఫలితంగా ఈ ఏడాది 70 కిలోమీటర్ల దూరంలోని జీడీపీ నుండి మళ్లించుకోవలసిన అవసరం ఏర్పడింది. తుంగభద్ర జలాల్లో కర్నూలు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు కేటాయింపులు ఉన్నా ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా ఆ సామర్థ్యంతో ఎస్ఎస్ ట్యాంక్ లేకపోవడం కర్నూలు ప్రజలకు పెద్ద శాపమనే చెప్పాలి. మరి భవిష్యత్తులో ఈ పరిస్థితులు తలెత్తకుండా ఇప్పటి నుండైనా జాగ్రత్త పడాల్సిన అవసరాన్ని కెఎంసి గుర్తిస్తే మంచిది.

## ఫలించిన 'శిల్పా' వ్యూహం



మాట్లాడుతున్న టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్‌వలి



మాట్లాడుతున్న ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్‌లాల్

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** నంద్యాల మున్సిపల్ సమావేశంపై మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి వ్యూహం ఫలించింది. మున్సిపల్ సమావేశంలో మాజీ ఛైర్ పర్సన్ దేశం సులోచన మౌనం దాల్చారు. అజెండా పూర్తి కావడం...టేబుల్ ఎజెండా ముగియడంతో ఆమె నిష్క్రమించారు. జీరో అవర్‌లో మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నీసా మున్సిపాలిటీలో అక్రమాలతో పాటు మున్సిపల్ స్థలం రిజిస్ట్రేషన్‌పై గళం వినిపించారు. మున్సిపల్ కౌన్సిల్ సమాశంలో టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్‌వలి, ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్‌లు సూర్య దినపత్రికలో వచ్చిన అక్రమాల కథనాలపై ప్రస్థావించారు. గురువారం కమీషనర్ నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం వేడి వేడిగా సాగింది. ముందుగా అజెండాను, టేబుల్ అజెండాను కౌన్సిల్ అమోదించింది. టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి మున్సిపల్ స్థలం రిజిస్ట్రేషన్‌పై మాట్లాడారు. సర్వే నెంబరు 2313/1సి లో 14.42 సెంట్ల విస్తీర్ణం మున్సిపల్ భూమి దాదాపుగా 50 కోట్ల విలువ అవుతోందని, దానిలో 2.60 సెంట్ల స్థలాన్ని 44 ప్లాట్లుగా విభజించి కొందరు అక్రమార్కులు ఒక బృందంగా ఏర్పడి బినామీలతో 8 మందికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దీంతో దీని వెనుక మున్సిపల్ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ల పాత్ర ఉందని మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. కౌన్సిలర్లు మున్సిపల్ స్థలంపై తమ నిరసన గళాన్ని వినిపించిన తరువాత మున్సిపల్ ఛైర్ పర్సన్ షేక్ మాబున్నిసా మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇచ్చారు. తాను మున్సిపల్ నిధులలో ఎటువంటి గోల్‌మాల్ చేయలేదన్నారు. తన నిజాయితీని శంకించాల్సిన అవసరం లేదని, తాను అవినీతికి పాల్పడి ఉంటే ఎంత దాకా అయినా సిద్ధంగా ఉన్నానన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలీ మాట్లాడుతూ తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, 2022వ సంవత్సరంలో ఒక వ్యక్తి హైకోర్టు ఆర్డర్ తెచ్చుకుని, జిపి చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు నిద్రపోతున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు కోర్టుకు ఎందుకు నివేదించి అక్రమ రిజిస్టర్‌లను ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్ మాట్లాడుతూ అసలు హైకోర్టు ఆర్డర్ ఏముంది? మున్సిపల్ అధికారులు హైకోర్టుకు ఎటువంటి నివేదికలు సమర్పించారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, వైస్ చైర్మెన్ పాంషావలీ, టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలీ అధికారులను నిలదీస్తూ చైర్‌పర్సన్‌కు వివరించారు. దీనిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ తన మీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నేను ఎలాంటి అవినీతి చేయలేదని అన్నారు. ఎవరైనా చేసి ఉంటే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ అధికారుల పాత్ర ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థలం రిజిస్ట్రేషన్‌పై పూర్తి స్థాయి నివేదిక అందించాలని అధికారులను ఆదేశిస్తూ కౌన్సిల్ సభ్యులకు తెలియచేయాలని ఆదేశించారు. అంతకు ముందు ఏసిపి నరసింహామూర్తి మాట్లాడుతూ మున్సిపల్ స్థలంపై మున్సిపాలిటీ తీసుకున్న చర్యలను కౌన్సిల్‌కు వివరించారు. సంతృప్తి చెందని కౌన్సిలర్లు పాత్రికేయుల వద్ద ఉన్న సమాచారం కూడా మున్సిపల్ అధికారుల వద్ద లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాబున్నీసా మాట్లాడుతూ మున్సిపల్ స్థలాన్ని ఒక్క సెంటు కోల్పోకుండా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అక్రమాలపై సంబంధిత అధికారులు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో ప్రతి అంశాన్ని కౌన్సిల్ ముందు ఉంచాలని ఆదేశించారు. అనంతరం అమృత్ పథకం ద్వారా నంద్యాల పట్టణంలో నీటి సమస్య రాకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ డా.అంకిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు ఎంఈ రమణమూర్తి, డిఈలు జయభారత్‌రెడ్డి, మధుకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఓ వెంకటకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహామూర్తి, రిజ్వాన, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్‌కు హాజరైన మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ దేశం సులోచన

## పాత పెన్షన్ ను పునరుద్ధరణ చేసే వారికే మా ఓట్లు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** పాత పెన్షన్ విధానంను పునరుద్దరిస్తామని ఏ రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టో లో మొదటి అంశంగాచేర్చి హామీ ఇస్తారో వారికే మా ఓట్లు అని యూ టీ ఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడ తూ ప్రస్తుతం సీఎం జగన్ ఎన్నికల ముందు వారం లోపు సీపీఎస్ విధానం ను రద్దు చేస్తానని చెప్పి అయిదేళ్లు పూర్తి అయినప్పటికి రద్దు చేయలేదని అంతకంటే మోసపూరితమె దిన కోర్పోరేట్ పెన్షన్ విధానం ను అమలు చేసి మోసం చేశాడని అన్నారు. ఇందుకు నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ మాకు పాత పెన్షన్ విధానం ను అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో వారికే ఓటు వేస్తామని తెలిపారు.సంఘం నాయకులు మద్దిలేటి, చంద్రపాల్, ఆక్బర్, నాగేశ్వరరావు, బాబు, బాజన్న, సుంకన్న, సలీమ్, అక్కన్న, రంగస్వామి, శ్రీనివాసులు, కృష్ణ పాల్గొన్నారు.

## కాలినడకన వెళ్లే భక్తులకు పండ్లు, మజ్జిగ పంపిణీ



పండ్లు, మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని తంగడంచ గ్రామ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్ద ధానధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్లే శివ భక్తులకు పండ్లు, మజ్జిగ, మందులు అందజేశారు. ఈ కార్యక్రమం మార్చి 5వ తేదీ వరకు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ట్రస్టు సభ్యులు సూర్యనారాయణ, జూపల్లె గోకారిలు తెలిపారు. కాలినడకన వెళ్లే భక్తులకు పండ్లు, మజ్జిగ, మందులు అందజేయడం వల్ల వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. శివ భక్తులకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు పాల్గొన్నారు.

## పదవి విరమణ ఉద్యోగికి సన్మానం



మనోరాజ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.మనోరాజ్ పదవీ విరమణ పొందారు. ఈ మేరకు గురువారం జీజీహెచ్‌లోని ధన్వంతరి హాల్లో మనోరాజ్ దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏమైనా పనులకు మినిస్ట్రీరియల్ స్టాఫ్ సిబ్బంది చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వరరావు, హేమనళిని, అకౌంటెంట్స్ కుమారస్వామి, లతీఫ్‌బేక్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సి.ఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 22కోట్లతో నిర్మించిన రెండు పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడానికి వస్తున్న నేపథ్యంలో హెలిప్యాడ్ మరియు సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ రఘువీర్ రెడ్డి, డోన్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డీలు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 4న సి.ఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

## దొర్నిపాడు ఎస్.ఐగా సురేష్ పదవీ బాధ్యతలు



ఎస్.ఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండల కేంద్రమైన దొర్నిపాడు మండల పోలీసు స్టేషన్ ఎస్.ఐగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్.ఐగా పనిచేసిన తిరుపాలు బదిలీ అయిన తరువాత ట్రైయినీ డీఎస్పీ రఘువీర్ కొద్దిరోజులపాటు ఇంచార్జిగా వ్యవహరించారు. ఉన్నతాధికారులు కర్నూలులో పని చేస్తున్న ఎస్.ఐ సురేష్‌ను ఇక్కడకు బదిలీ చేయడంతో ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ సురేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తానని ఆయన తెలిపారు. ఎ.ఎస్.ఐ ప్రతాప్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పుర వీధుల్లో వెలగని వీధి దీపాలు..?

**పట్టణంలో వీధి లైట్లు పడకతో ప్రజల ఇబ్బందులు**

**24/7 వీధి దీపాలు వేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం**

**ప్రధాన విధుల్లో తప్పా పట్టణంలో చాలా చోట్ల వెలగని లైట్లు..**

**పద్ధతి మార్చుకోని పంచాయతీ అధికారులు**





**వెల్దుర్తి ,మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి పట్టణంలో ప్రధాన రహదారులలో తప్ప చాలా వీధుల్లో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నాము అని వాపోతున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుండి ఉదయం 6గంటల వరకు వేలగాలిసిన వీధి లైట్లు వేయడం లేదని ఒక వేళ వేసిన రాత్రి 7 లేదా 8గంటల తర్వాతే వేస్తున్నారని ఇక ఉదయం ఎప్పుడు వెలుగుతూనే వుంటాయని పట్టణ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ కార్యదర్శి ,ఇతర సిబ్బంది పూర్తిగా విఫలం అయ్యారని ప్రజలు మండి పడుతున్నారు. అసలు పంచాయతీ అధికారుల పనితీరు ఎలా ఉందంటే పట్టణంలో ఏమైనా కానీ.. మా జీతం మాకు వస్తుంది అనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉండటం గతం లో మాదిరిగా పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం సిబ్బందికి జవాబుదారీతనం లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు.పట్టణంలో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదురుకుంటున్నారు.వీధి లైట్లు సకాలంలో వేయకపోవడం,పారిశ్యుద్య పనులు లోపించడం, తాగునీటి సరఫరాలో అలసత్యం వహించడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు తెల్పుతున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నత అధికారులు ఈ మేజర్ పంచాయతీ పై ప్రత్యేక దృష్టి పెట్టి గతంలో మాదిరిగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నాగలూటి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**– ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్న భైరెడ్డి సిద్ధార్థరెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పోచా, భైరెడ్డి సిద్ధార్థరెడ్డి

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండలంలోని నాగలూటి గ్రామంలో భైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ ఉషారాణి, వైసీపీ సీనియర్ నాయకుడు సర్వేశ్వరరెడ్డి, సహకార సొసైటీ ఛైర్మెన్ తులసిరెడ్డి తెలిపారు. మండలంలోని మా నాగలూటి గ్రామంలో దాదాపుగా 2.5 కోట్ల వ్యయంతో చేపట్టి అభివృద్ధిని నియోజక వర్గంలో ఎక్కడాలేని విధంగా సిద్దార్థరెడ్డి మరియు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నిధులతో మరియు జగనన్న అందించిన నిధులతో సచివాలయాలు, ఆరోగ్య కేంద్రం, రైతుభరోసా, జలజీవన్ మిషన్, రోడ్లు, పొలాల రహదారులు, మినరల్ ప్లాంట్ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కరించే విధంగా నాగలూటి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని సర్పంచ్ ఉషారాణి అన్నారు. గురువారం భైరెడ్డి సిద్దార్థరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిలతో కలిసి పూర్తి అయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అభివృద్ధి చేసిన పనులను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సిద్ధార్థ అన్నారు. వైసీపీ పాలనలో నియోజక వర్గంలో గతంలో ఎప్పుడూలేనంత అభివృద్ధి చేసి చూపించామన్నారు. సీఎం చొరవతో చేస్తున్న సంక్షేమ పథకాల అమలు అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తే చాలని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు అక్కడ అక్కడ మా సొంత నిధులతో నిర్వహించామని వైసీపీ సీనియర్ నాయకుడు సర్వేశ్వరరెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో వైయస్సార్‌సీపీని గెలిపించాలని నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధారా సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ ఛైర్మెన్ నాగతులసిరెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నందికొట్కూర్ మున్సిపల్‌ఛైర్మెన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నబీరసూల్, సర్పంచులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగస్వామిరెడ్డి, ఫణిభూషణ్‌రెడ్డి, చిన్న రామచంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టరు జగదీశ్వరరెడ్డి, జబ్బార్, నాగలూటి గ్రామ వైసీపీ నాయకులు చిన్న పుల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతు బాధితులకు భూసేకరణ చట్టం అమలు చేయాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సోలార్, కల్వకుర్తి 167 హైవే రోడ్డుకు ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న బాధితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది పాణ్యం మండలం ఆలమూరు, కందికాయపల్లె, కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 హైవే రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు నంద్యాల కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌లు మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు రైతుల భూములను కారుచౌకగా నష్టపరిహారంతో భూములు స్వాధీనం చేసుకుంటూ రైతులను బెదిరిస్తూ ఉంటే స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రజలకు సహకరించక కంపెనీ యజమానులకు అమ్ముడుపోయి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. అధికారపార్టీ నాయకులు రైతులకు రావాల్సిన నష్టపరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేట్‌పైన నాలుగు రేట్లు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని పట్టా భూములతో పాటు డిపట్టా అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు కూడా సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని అన్నా నాలుగు నెలలు అయిందన్నారు. 2013 భూ సేకరణ చట్టం అమలు చేసే వరకు ఈఉద్యమం ఆగదని అన్నారు. ప్రభుత్వం న్యాయం చేసేవరకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని ఈ పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎల్లవేళలా మద్దతుగా ఉంటామని అన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే సోలార్ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏకు వినతిపత్రం అందజేశారు. ఆలమూరు, కందికాయపల్లె, పిన్నాపురం, కొత్తపల్లి మండలం సింగరా జుపల్లె, బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె, ఏకోదూరు, బండి ఆత్మకూరు, నంద్యాల మండలం బిల్లలాపురం తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో ఏడు గడ్డివాములు దగ్ధం

**-ఏడు గడ్డివాముల్లో ఐదు గడ్డివాములు పూర్తిగా దగ్ధం..**

**-పాక్షికంగా దెబ్బతిన్న రెండు గడ్డివాములు.. -రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం..**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కంబళదహల్ గ్రామంలో గురువారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులకు సంబంధించిన ఏడు వరిగడ్డి వాములు పూర్తిగా దగ్ధమైయ్యాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని పలువురు తెలిపారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడటంతో ఇది గమనించిన కొందరు స్థానికులు మంటలను ఆర్పేందుకువిశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో వెంటనే గ్రామస్తులు ఎమ్మిగనూరు అగ్నిమాపకదళ అధికారులకు సమాచారం అందించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.అయితే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన కంబళదహల్ గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో 7గడ్డివాముల్లో 5గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. మిగిలిన రెండు గడ్డివాములు పాక్షికంగా దెబ్బతిన్నట్లు.అగ్నిమాపక అధికారులు తెలిపారు. అయితే మంటల్లో సుమారుగా రూ.3 లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం సంభవించిందని సిబ్బంది చెప్పారు. గడ్డివాము భాదితులుగా గ్రామ సర్పంచ్‌దస్తగిరి. ఉచ్చప్ప. దేవన కొండ గూరన్న.నారాయణ.పింజరిఉశేని.బోడితిమ్మప్ప. కలగట్ల పక్కిరప్ప. కులమాలతిమ్మాప్పలు ఉన్నారని వారు తెలిపారు. అలాగే భాదితులు సర్పంచ్ దస్తగిరి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో వరిగడ్డివాములు కాలిపోయిన భాదితులకు పశువుల కు ప్రభుత్వం నుంచి పశుగ్రాసం సరఫరా చేసి తమను ఆదుకోవాలని వరిగడ్డివాము బాధితులు ఉన్నతాధికారులను కోరారు.

# శిల్పా కుటుంబానికి వ్యాపారాలపై ఆసక్తి..అభివృద్ధిపై అనాసక్తి

**– బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** శిల్పా కుటుంబం వ్యాపారాలపై ఆసక్తి చూపిస్తున్నారే తప్ప పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు ఆరోపించారు. గురువారం గోస్పాడు మండలంలో ప్రజాపోరు యాత్రలో భాగంగా ప్రత్యేక వాహనంపై నుంచి మాట్లాడుతూ సండే ఎమ్మెల్యే మాకొద్దని ఒక ఓటరు తెలియజేశారని తమకు పూర్తి ఎమ్మెల్యే కావాలని కోరుతున్నారన్నారు. కేంద్ర పథకాలతో తాము చేసినట్లుగా వైసీపీ ప్రభుత్వం చెప్పుకుంటూ పబ్బం గడపుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ కౌన్సిలర్లు కూడా విశ్వకర్మ యోజన


మాట్లాడుతున్న నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు

కింద అనేక మందికి ఉపాధి పథకాలను అందిస్తుంటే క్యాలెండర్ తీసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. ఇవి జగనన్న సాధించిన పథకాలని చెప్పుకుంటున్నారని తెలిపారు. కేంద్ర పథక నిధులతో పేదల ప్రజలకు అందకుండా చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతున్నదని కేంద్రం ఎన్నిసార్లు హెచ్చరించినా జగన్ ఎలాంటి మార్పులేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలను కాపాడుకోవడానికి బీజేపీ రంగంలో దిగిందని తెలిపారు. ఏపీ అంటేనే అవినీతి, నేరాలు, కబ్జాలకు నిలయంగా మారిందన్నారు. నిరంకుశ ప్రభుత్వం నుంచి ప్రజలను కాపాడుకోవడానికి బీజేపీ ప్రజాపోరు యాత్ర చేపట్టిందన్నారు. శిల్పా కుటుంబం ఆగడాలను అడ్డుకోవాలని బీజేపి పార్టీని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో స్వాతి, మేడా మురళీధర్, కశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలం చేరుకున్న పారువేట ఉత్సవమూర్తులు

**అహోబిలేశ్వరులకు పూర్ణకుంభ స్వాగతం**

**ఉత్సవ మూర్తులకు లఘు సంప్రోక్షణ**

**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ :** పారువేట ఉత్సవ పల్లకి గురువారం తెల్లవారు జామున అహోబిల క్షేత్రం చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం శ్రీ ప్రహ్లాద వరదస్వామి, శ్రీ జ్వాల నరసింహస్వామి లకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపుగా అహోబిల క్షేత్రం చేరుకున్న అహోబిలేశ్వరులకు సేదతీర్చేందుకు ఉపశమనం కోసం ప్రధాన అర్చకులు,అర్చక బృందం లఘు సంప్రోక్షణ నిర్వహించి ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం నిర్వహించారు. అహోబిలేశ్వర్లు కొలువుదీరిన ఉత్సవ పల్లకి జనవరి 16న సంక్రాంతి కనుమ నాడు ప్రారంభమైన పారువేటఉత్సవాలుగురువారంతో ముగిశాయి. ఉత్సవ పల్లకి మూడు మండలాల్లో 45 రోజులపాటు 33 గ్రామాల్లో పర్యటించి మార్చి మాసంలో జరిగే తమ కళ్యాణ ఉత్సవాలకు స్వయంగా భక్తులను ఆహ్వానించేందుకు ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన తెలుపులపై ఆసీనులై భక్తుల నుండి పూజలు అందుకున్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 45 రోజులపాటు ఈ అహోబిల క్షేత్రంలో మాత్రమే పారువేట ఉత్సవాలు కొనసాగుతాయి. 150 సంవత్సరాలకు పైగా పారువేట ఉత్సవాలు ఈ క్షేత్రంలో జరుగుతున్నాయని ప్రధానార్చకులు తెలిపారు. అనాదిగా


అహోబిలేశ్వరుల ఉత్సవ పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వస్తున్న ఆచారం ప్రకారం అహోబిల క్షేత్రంలో వెలసిన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాద వరద స్వాములు ఇరువురు కలిసి ఉత్సవ పల్లకిలో బయలుదేరి పారువేట ముగియగానే తిరిగి అహోబిల క్షేత్రం చేరుకుంటారు. అహోబిలేశ్వరులు అహోబిలం చేరుకున్న తర్వాతనే అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అహోబిల గ్రామంలోకి చేరుకోగానే ఎలక్ట్రికల్ ఏడిఈ రవికాంత్ చౌదరి బోయిలకు, భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిపిఎ సంపత్, ఓ ఎస్ డి శివ ప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతు రామన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారిణి కౌసల్య అన్నారు. గురువారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలోని గ్రంథాలయంలో మొరార్జీ రాంచోడ్జీ దేశాయ్ 128వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా మొరార్జీ రాంచోడ్జీ దేశాయ్ 1977–79లో మధ్య భారత నాలుగో ప్రధానమంత్రిగా పనిచేయశాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న శ్రీ సుమం

## పులుల సంరక్షణ,అభివృద్ధి కొరకు విరాళం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**

నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్ట్‌లో పులుల సంరక్షణ కొరకు వైల్డ్ లైఫ్ అడ్వైజర్ గంగరాజు రంగరాజు, కాశీరాజు, బి. శైలరాజు శ్రీసుమంలు కలసి రూ.7 లక్షల చెక్కును విరాళంగా జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్ మీనాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిబియం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ త్రినాథ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# మహిళ మెదడులో పెద్ద కణితి

**– శస్త్రచికిత్స చేసి తొలగించిన కర్నూలు కిమ్స్ వైద్యులు**

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్ :** మహిళ మెదడులోని పెద్ద బంగాళదంపంత సైజులో ఉన్న కణితిని కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు తొలగించారు. ఈశ్వరమ్మ అనే మహిళకు మాట బాగా తడబడటంతోపాటు తీవ్రమైన తలనొప్పివచ్చి ఇబ్బంది పడ్డారు. మొదట వేరే ఆసుపత్రికి వెళ్లగా అక్కడి నుంచి కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆమెను కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ సుమంత్‌కుమార్ పరీక్షించారు. దీంతో ఆమె మెదడులో కణితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో 14గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. దీంతో ఈశ్వరయ్య పరిస్థితి మెరుగుపడింది. శస్త్రచికిత్స చేసిన తర్వాత మహిళ ఆరోగ్యం బాగుపడిందని డాక్టర్ తెలిపారు.



డాక్టర్ సుమంత్‌కుమార్

# కోట్లను కలిసిన డోన్ టీడీపీ నాయకులు..


కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**డోన్,మేజర్ న్యూస్ :** డోన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గురువారం కర్నూల్‌లోని కోట్ల నివాసంలో డోన్ టీడీపీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ కేషవభట్,నంద్యాల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి విజయభట్,శ్రీనివాస భట్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,డోన్ నియోజకవర్గానికి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు.కోట్లను అభ్యర్థిగా నియమించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు,మాజీ ఉప ముఖ్యమంత్రి కె.యి కిష్టమూర్తికి,టీడీపీ మాజీ మంత్రి కె.యి ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డోన్ నియోజకవర్గంలో కోట్ల కుటుంబం గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని,అహర్నిశలు కష్టపడి విజయానికి తోడ్పాటును అందిస్తామన్నారు.అనంతరం కోట్లను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కోట్లను కలిసిన వారిలో టీడీపీ నాయకులు ప్రకాష్ భట్,కామిశెట్టి చైతన్య, గురు రాజ్ భట్, రంగస్వామి,కోట్ల అభిమానులు, తదితరులు కలిసి కోట్లను అభినందించారు.

# దశాదిశా లేని మంగళగిరి జెండా సభలు..

**మతిభ్రమించి మాట్లాడుతున్న పవన్.. గంగుల**

**మంగళగిరి సభ అట్టర్ ఫ్లాప్**


మాజీ ఎంపికి గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నానికి ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** జనసేన టిడిపి కలయికతో మంగళగిరిలో జరిపిన జెండా సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, ఆ సభకు దశా దిశా నిర్దేశం ఏమైనా ఉన్నాయా అని అందుకే సభ అట్టర్ ఫ్లాప్ కావడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ రాష్ట్ర సలహాదారుడు మాజీ శాసన మండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డిలు అన్నారు. గురువారం చాగలమర్రిలో వినాయక నగర్ లో వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుండూరు వెంకటరమణ,సోదరుడుచుండూరు చిన్న వెంకటరమణ కుమార్తె చరిత బాల కొండయ్యల రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా,వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జే సి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్ అస్వస్థకు గురి కావడంతో ఆయనను పరామర్శించారు అనంతరం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి కలయికను అట్ట హాసంగా జరిపి పాలక పక్షానికి దీటుగా నిలబడాలని మంగళగిరిలో జెండా సభను నిర్వహించారు. ఈ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మతిభ్రమించి అసభ్య పదజాలంతో మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే పవన్ కళ్యాణ్ను పరిటాల రవి గుండు గీయించిన సంఘటనలు మర్చిపోయాడని ఎద్దేవా చేశారు. పార్టీ అధ్యక్షుడు హోదాలో హుందాతనంగా మాట్లాడాల్సింది పోయి మతిభ్రమించి మాట్లాడినందుకు సభలోనే ప్రజలు మహిళలు చెప్పులు రాళ్లు విసిరిన సంఘటన మంగళగిరిలో చోటు చేసుకోలేదా అన్నారు. రాష్ట్ర విడిపోయి మొదట ముఖ్యమంత్రిగా చేసిన ప్రతిపక్ష నేత ఏమి చేసినారో తెలియజేయాల్సింది పోయి మద్యం పై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మాటలు చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలను మద్యానికి బానిసలుగా చేసిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు అసత్య ఆరోపణలు అసత్య వాగ్దానాలు ఇచ్చి కల్లబొల్లి మాటలతో అందలం ఎక్కాలని చూస్తున్నారని అలాంటివారికి నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. మంగళగిరి సభలో సిక్స్ ప్యాక్‌తో కూడిన ప్యాకేజీ ఏమి వస్తువులు ఉన్నాయో చూడాలని ప్రశ్నించారు. ఈ జెండా సభకు ఆరు లక్షల మంది కాదు కదా 50వేల మంది కూడా హాజరు కాలేదన్నారు. అదే వైఎస్ఆర్సిపి అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభకు పిలుపునిస్తే నాలుగు లక్షల పై మంది హాజరయ్యారని రెండో సభకు పిలిస్తే ఆరు లక్షల పైగా జనాలు వచ్చారన్నారు మూడవ సిద్ధం సభ అనంతపురం రాప్తాడు జరిగితే 12 లక్షల మందికి పైగా హాజరు కావడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తన పాలనవలలో మంచి జరిగింటేనే తిరిగి మనలను ఆశీర్వదించాలని ప్రతి సభలో పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించి తిరిగి ప్రజల్లోకి వెళ్ళడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో జనసేన తెలుగుదేశంపార్టీ తుడిచిపెట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం లో అధికార పార్టీని వదిలి ఏ కార్యకర్త వీడలేదని ఎవరో కల్లబొల్లి ప్రజలు వెళ్తే భూతద్దంలో చూపడం ఎంతవరకు సమంజసమన్నారు. త్రాగునీరు సాగునీరు కోసం ఏ విధానానికైనా చర్చకు సిద్ధమేనని, త్రాగునీరు ఎక్కడ తలెత్తకుండా చూసేందుకు సంబంధిత అధికారులతో నివేదికలు తయారు చేసి త్రాగునీరు లోటు లేకుండా చూసే బాధ్యత నాది అని వారు హామీ ఇచ్చారు. త్రాగు నీటి కోసం అవుకు రిజర్వాయర్ నుండి 700 టిఎంసి నీటిని సరఫరా చేసేందుకు సంబంధిత చీఫ్ ఇంజనీర్‌తో చర్చలు జరపమన్నారు. అలాగే ముచ్చుమరి నుండి మూడు పంపులను నీటిని విడుదల చేయడం జరిగిందని సంత జూటూరు వరకు మీరు వచ్చాయని నేడో రేపు తెలుగు గంగా కేసు కెనాల్ కు త్రాగునీరు భూగర్భ జలాల అభివృద్ధి కోసం విడవడం జరుగుతుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం భూకబ్జాలు, పంచాయతీలో డబ్బులా కోవడం సెటిల్మెంట్లు, స్వీపర్ పోస్టులకు డబ్బులు దండుకునేది ఎవరనేది ప్రజలందరికీ తెలుసు అని వారు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని నియోజకవర్గ స్థాయి నాయకులు, తమ బంధువులు కూడా వైఎస్ఆర్సిపి పార్టీలోకి రావడం జరుగుతుందన్నారు. వైఎస్ఆర్సిపి సంక్షేమ పార్టీ కనుక ఆకర్షితులై నాయకులు


మాట్లాడుతున్నమాజీ ఎంపి గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

నాయకులే కదులుతున్నారని వారు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం తమ పాలనలో అభివృద్ధి చేసిన నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. తాగునీటి కోసం, జిల్లా పరిషత్ మండల పరిషత్ పంచాయతీ రాజ్ ముఖ్యమంత్రి అభివృద్ధి ప్రణాళిక నుండి నిధులు సేకరించి నీటి ఎద్దడి రాకుండా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరభద్రుడు, సీనియర్ నాయకులు గో ఎంపిటిసి పత్తి నారాయణ, డి.వని పెంట సర్పంచ్ రేనాటి బాలిశ్వర్ రెడ్డి ,మద్దూరు జమాల్,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గణేష్ రెడ్డి, ముత్యాలపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు శేష రమేష్, తోడేళ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, చాగలమరి ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఖాదర్బాషా, రమణారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు డోన్‌కు కోట్ల రాక


కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

**డోన్,మేజర్‌న్యూస్:** నేడు కేంద్ర మాజీ సహాయ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి డోన్ పట్టణానికి విచ్చేస్తున్నట్లు సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, రాష్ట్ర టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ వైస్ చైర్మన్ టిఈ. కేశన్నగౌడ్, సీనియర్ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక గుత్తి రోడ్డులో గల అమ్మ హోటల్ సర్కిల్ నుండి పాత బస్టాండ్ మీదుగా మధు ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించే భారీ ర్యాలీకి డోన్ నియోజకవర్గ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నంద్యాల టిడిపి అధ్యక్షుడు పై అక్రమంగా రౌడీషీట్

**అక్రమంగా పెట్టిన రౌడీషీట్ ను ఉప సంహరించుకోవాలి**

**వైఎస్సార్ నగర్ టిడిపి ఇంఛార్జ్ తాడికొండ బుగ్గ రాముడు**


టిడిపి నాయకుడు బుగ్గ రాముడు

**నంద్యాల, మేజర్‌న్యూస్ :**నంద్యాల టిడిపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్‌పై అక్రమంగా పెట్టిన రౌడీషీట్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని నంద్యాల టిడిపి సీనియర్ నాయకుడు,వైఎస్సార్ నగర్ టిడిపి ఇంఛార్జి తాడికొండ బుగ్గరాముడు డిమాండ్ చేశారు.బుధవారం బుగ్గరాముడు మాట్లాడుతూ,నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు, బీసీ నాయకుడైన మల్లెల రాజశేఖర్ గౌడ్ పై అక్రమంగా వైసీపీ ప్రభుత్వం ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ లో రౌడీషీట్ ఓపెన్ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. మొట్టమొదటిసారిగా ఒక బీసీ నాయకుడుని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నంద్యాల జిల్లా అధ్యక్షులుగా నియమించారని అటువంటి బీసీ నాయకుడు,టిడిపి జిల్లా అధ్యక్షునిగా పై రౌడీ షీట్ ఓపెన్ చేయడం వైసీపీ కక్ష సాధింపు చర్యని బుగ్గ రాముడు అన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీ నాయకులంతా ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు రాజకీయ కక్ష తో అక్రమ కేసులు బనాయిస్తూ రౌడీ షీట్ ఓపెన్ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్నికల వేళ వైఎస్ఆర్సీపీ నాయకులు కావాలనే రాజకీయ కక్షలతో చేసే పనులు ఆపాలని కోరారు.

# వైసీపీ నుండి టీడీపీలోకి చేరికలు


తెదేపాలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎన్నికల తరుణం సమీపిస్తున్న కొద్ది టీడీపీలోకి చేరికలు మొదలవుతున్నాయి. నియోజకవర్గంలోని రుద్రవరంమండలం చిలకలూరు గ్రామానికి చెందిన ముల్ల రాజాక్,ముళ్ళ వన్నూరు భాష,ముళ్ళ మమ్మద్ హుస్సేన్,భూ అమ్మగారి చిన్న పక్కిరా,సిరివెళ్ల అబ్దుల్ హుస్సేన్,ముళ్ళ బాషు,ముళ్ళ అమీర్ భాష,సిరివెళ్ల మంజుల,ముల్లా సోదరులుమరియు 50 కుటుంబాలు భూమా అఖిల ప్రియ గారి ఆధ్వరంలో తెలుగుదేశం పార్టీ లో చేరడం జరిగింది. పార్టీలోకి వారందరినీ పచ్చ కండువా కప్పి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ భార్గవ రామ్ దంపతులు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ మాట్లాడుతూ మా నాయకత్వం తెదేపా విధివిధానాలు ,అధికారంలోకి వస్తే తెదేపా జనసేన ఉమ్మడి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అందరికీ నచ్చి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందన్నారు. మమ్మల్ని నమ్మి వచ్చిన వారికి అండగా ఉంటామన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో


నమూనాలను పరిశీలిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలోని సంకల్‌భాగ్‌లో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం సైన్స్ఎక్స్‌పో క్యాక్రమం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల నమూ నాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఏజీఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి సమాజానికి తగ్గట్టు మారాలన్నారు. ప్రపంచంలో జరిగే విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమా, ఆర్ఐ సీతారామిరెడ్డి, డీన్ హరికిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ


పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్ :** ఏ ఒక్క పేద కుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఇళ్ల పట్టాల పంపిణీ నిర్ణయం చారిత్రాత్మకమని 34వ వార్డు ఇంచార్జి విశ్వనాథ రమేష్ పేర్కొన్నారు. గురువారం లబ్ధిదారులకు మంజూరైనా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**రూ.15 లక్షల నగదు మంజూరు..**

**చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**



**వెల్దుర్తి ,మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వారాధి చిన్న మాదన్న కడుపు ఉబ్బరంగా ఉందని కర్నూల్ లోని స్టార్‌హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం వెళ్లి నాలుగు రోజులు హాస్పిటల్లో చికిత్స పొందిన అనంతరం అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మాదన్నకు లివర్ మార్పిడి చేయవలసి ఉంటుందని ఈ ఆపరేషన్ సౌకర్యం మా దగ్గర లేదని హైదరాబాదులోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించాలని డాక్టర్ల సూచించారు. డాక్టర్ల సూచన మేరకు.. హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పిటల్ కి వెళ్లిన మాదన్న కుటుంబ సభ్యులకు హైదరాబాద్లో హాస్పిటల్ డాక్టర్లు మదన్న పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆపరేషన్ చేయాలనీ, ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.20 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలియజేశారు. మాదన్న కుటుంబ సభ్యులు మాదన్నకు ఆపరేషన్ చేయించడానికి ఆర్థిక స్తోమత లేక ఆవేదన వ్యక్తం చెందుతున్న విషయాన్ని గోవర్ధనగిరి గ్రామస్తులుపత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మకు తెలియజేశారు.విషయంతెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీదేవమ్మ వెంటనే స్పందించి విషయాన్నీ సీఎంవో అధికారులకు తెలియజేసి ఆపరేషన్ నిమిత్తం తక్షణమే రూ.15 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాదన్న కుటుంబ సభ్యులకు కర్నూల్ లోని ఎమ్మెల్యే స్వగృహంలో బాధితులకు గురువారం అందజేశారు. సమస్య తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి సహాయం అందించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ రుణం తీర్చుకోలేమని మాదన్న కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అడిగిన వెంటనే సహాయం అందించినందుకు గోవర్ధనగిరి గ్రామస్తులు ఎమ్మెల్యే సహాయ గుణానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సహాయం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా గ్రామస్తులు, బాధితుని కుటుంబ సభ్యులు, బాధితుడు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తాడేపల్లి గూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** తాడేపల్లి గూడెంలో జరిగిన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. గురువారంనాడు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాడేపల్లి గూడెంలో టీడీపీ , జనసేన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్‌కు భయం పుట్టుకుందని టీడీపీ జనసేన చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారం కోసం కాదని 5కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమని వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి అని అన్నారు. రాష్ట్ర పునఃనిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని జగన్ రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్లారని తూర్పు గోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రమణ్యంను వైకాపా ఎమ్మెల్సి అనంతబాబు హత్య చేసి ఆ మృతదేహాన్ని వారి ఇంటికి డోర్ డెలివరీ చేశారని టీడీపీ అన్నా క్యాంటీన్‌లను తెరిచి పేదలకు 5రూపాయలకు భోజనం పెడితే జగన్ వాటిని మూయించారని కరోనా సమయంలో ఫేస్‌మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడిగా ముద్రవేసి చంపారన్నారు. వైకాపా వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహారి పారిపోయాడని ఇవన్నీ జగన్ రెడ్డి పెత్తందారు పోకడలకు నిదర్శనమని మండిపడ్డారు. వైనాట్ 175 అంటున్న జగన్ రెడ్డి అసలు వైసీపీకి మనం ఎందుకు ఓటు వేయాలో ఆయన ఏం సాధించారో చెప్పాలన్నారు. జాబు క్యాలండర్ లేదు, డీఎస్సీ లేదు, ఉచిత ఇసుక లేదు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ సూపర్‌సిక్స్‌ని ప్రవేశపెట్టారని రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గరఉందన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తానని సాగు నీరు అందించి రైతులను ఆదుకుంటామని యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని వారు తెలిపారు.

# లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు అధికారులు

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండల కేంద్రంలో గురువారం స్థానిక సచివాలయ ఆవరణలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, డిప్యూటీ ఎమ్మార్వో పటాన్ బాబు,వైసిపి మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డిలు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు సందర్భంగా రామలింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఏ సంక్షేమ పథకమైన మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఇళ్ల పట్టాలు కూడా మహిళలపై రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరో అవకాశం ఇచ్చి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల భాగ్యమ్మ, కో ఆప్షన్ నెంబర్ ముర్తుజావలి, వైసిపి ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రావు, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్ ,మాజీ సర్పంచ్ విజయసింహారెడ్డి,విఆర్ఓ ముర్తుజావలి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, మాజీ ఎంపిటిసి చౌడయ్య,పి ఎం సి చైర్మన్ శ్రీనివాసులు వాలంటీర్లు,సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజస్తంభ, గాలిగోపురం ప్రతిష్టా మహోత్సవం

**మిద్దూరు, మేజర్‌న్యూస్ :**

మిద్దూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రతిష్టా మహోత్సవాలూ వైభవంగా నిర్వహించారు. లోకకళ్యాణం కొరకు అనాధి నుండి ఆధ్యాత్మికంగా పాండవ రాజుల్లో అర్జునుడు మునిమనవడు జనమేయజయ మహారాజు నిర్మించిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి ధ్వజస్తంభం, గాలి గోపురంలను పున ప్రతిష్టించడం ఎన్నో ఏళ్లనాటి కల నెరవేరిందని గ్రామస్తులు మరియు టీటీడీ సహకారంతో భక్తి భావన నెలకొనాలనే ఉద్దేశ్యంతో ఈ ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు చేయించిన ఘనత భైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి సహకారంతో కార్యక్రమాలను నిర్వహించామని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ తువ్వా శివారామకృష్ణారెడ్డి అన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆలయ అభివృద్ధి కమిటి వారు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ట వేద మంత్ర హోమాలతో గాలి గోపురానికి కలశాలను ఏర్పరచారు. అనంతరం ప్రధాన అర్చకుడు కొండా గిరిధరశర్మ మరియు శ్రీరామదత్త ఆశ్రమ ఉపన్యాసకుడు మల్లిఖార్జునరావు గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు నారాయణ వారి సహకారంతో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ బన్నూరు నాగిరెడ్డి, ఎరబం ప్రభాకరరెడ్డి, ఖాతా హరిసర్వోత్తమరెడ్డి, మరియు గ్రామ పెద్ద ఖాతా రామచంద్రారెడ్డి తదితర భక్తులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభ ప్రతిష్టా నిర్వహిస్తున్న దృశ్యం



విద్యుత్ ఘాతానికి గురైన దివాకర్

## విద్యుత్ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యానికి

# బలవుతున్న వర్కర్లు..?



వీపుపై కాలడంతో చీలిన శరీరం

.. కరెంటు షాక్ తగలడంతో పూర్తిగా కాలిపోయిన దివాకర్ శరీరం..

.. తమకు సంబంధం లేదంటున్న విద్యుత్ అధికారులు..

.. బాధితుడు చికిత్స పొందుతుండగానే విధుల్లో చేరిన లైన్‌మెన్..

.. నిర్లక్ష్యం చేసిన వారిపై తూతూ మంత్రంగా విద్యుత్ అధికారుల చర్యలు..

.. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంలో ట్రాన్స్‌కో విఫలం..

**కర్నూలు, ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఆలూరు మండలం కరడిగుడ్డం గ్రామంలో వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ లైన్ పనులు చేయడానికి కాంట్రాక్టర్ హత్తిబెలగల్ గ్రామానికి చెందిన దివాకర్‌ను పనిలో పెట్టుకున్నారు. అయితే ఫిబ్రవరి13వతేది ట్రాన్‌ఫార్మర్ పనులు జరగతుండగా లైన్‌మెన్, కాంట్రాక్టర్ కరెంటును నిలిపివేశామని ఫోన్‌ద్వారా చెప్పగా భాదితుడు పోల్‌పై ఎక్కాడు.అయితే తీగలకు కరెంటు సరాఫరా అవడంతో అతని శరీరం బాగా కాలిపోయింది. వెంటనే కరెంటును ఆపివేయించి భాదితుడిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మైరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదంపై పోలీసులకు సమాచారం ఇవ్వకండా కళ్ళుగప్పారు. తర్వాత కొన్ని రోజులుకు భాదిత భంధువులు పోలీసులకు తెలపగా కాంట్రాక్టరు ఆసుపత్రి కర్చులు భరిస్తానని తెలిపినట్లు తెలిసింది.అయితే ప్రాణాపాయ స్థితిలో ఉన్న దివాకర్ శరీరం చేతులు,వీపు,నడుము కిందిభాగం, చేతులు, ఎక్కువగా కాలడంతో నయం కావడం ఆలస్యం అవుతుందని వైద్యులు తెలిపారు.ప్రభుత్వం ఉన్నతాధికారుల అధేశాల మేరకు ప్రమాదంపై ఏపిటిఎస్ ఎస్సై మౌలియతో విచారణ జరపగా ఏ.ఈలోకేష్ లైన్‌మెన్ చంద్రశేఖర్, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.అయితే జిల్లా అధికారులుతో ఆలూరు విద్యుత్ అధికారులకు ఉన్న సన్నిహిత్యంతో కేవలం ఏ.ఈ లోకేష్‌కు మెమో,లైన్‌మెన్ చంద్రశేఖర్‌ను 15 రోజుల పాటు సస్పెండ్ చేసిచే తులు దులుపుకున్నారు. అయితే విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు డిఈఈ నాగేంద్రప్రసాద్‌తో వాగ్వాదానికి దిగగా ఏ.ఈ,డిఈఈలు బళ్లారికి వెళ్లి భాదితుడిని పరామర్శించినట్లు తెలిసింది.గతంలో ఇదే విద్యుత్ అధికారులు అరికెరలో కొత్త లైన్ వేస్తుండగా పైన హైటెన్షన్ వైర్లు తగిలి ఇద్దరు వ్యక్తులు మరణించారు.వారికి ఎటువంటి సహాయం అందించారో తెలియదు.అలాగే అరికెర గ్రామంలో రథోత్సవం లాగుచున్నప్పుడు కరెంటు తీగలకు రథం పైభాగం తగిలి ఒకరు మృతి చెందారు.ఇలా పలుమార్లు విద్యుత్ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ట్రాన్స్‌కో ఆధుకోవడంలో విఫలమవుతుంది. అయితే విద్యుత్ పనులకు వర్కర్లను చేర్చుకునేటప్పుడు వారికి నైపుణ్యం ఉందా వారికి గ్రూప్ ఇన్సూరెన్సు చేశారా అని ఆరా తీయకుండా కాంట్రాక్టర్ నైపుణ్యం లేనివారితో పనిచేయించినా గుడ్డిగా బిల్లులు చెల్లిస్తున్నారు.ఇదే కాంట్రాక్టరు జగనన్న కాలనీలో కరెంటు స్థంబాలు,విద్యుత్ తీగలు అమర్చడంలో నాసిరకంగా పనిచేసి లక్షలు మింగారని పలువురు చర్చించు కుంటున్నారు.అలాగే పెద్దహోతూరు రియల్ ఎస్టేట్‌కు ప్రభుత్వం నుండి అనుమతి లేకున్నా కరెంటు స్థంబాలు నాటి తమ ప్రేమను చూపించుకున్నారు.



విద్యుత్ ప్రమాదానికి కారణమైన లైన్ మెన్

తర్వాత పంచాయతి వారు పిర్యాదు చేస్తే తొలగించినట్లు తెలిసింది.ఏ.ఈ కొన్నేళ్లుగా ఆలూరు నియోజకవర్గంలో తిష్టవేసినట్లు తెలసింది.జిల్లా ఉన్నతాధికారితో ఉన్న భందుత్వం వల్ల ఇక్కడ పనిచేస్తున్న విద్యుత్ అధికారులకు బదిలీలు అంతగా ఉండవు.అలాగే కాంట్రాక్టరు కూడా కిందిస్థాయి నుండి పై స్థాయి ఉద్యోగుల వరకు ఆలనాపాలనా చూస్తూ తనకు కాంట్రాక్టు పనులను దక్కించుకున్నారు. కాంట్రాక్టరు నిరుద్యోగ యువకులకు గాళం వేసి తక్కువ వేతనంతో పనిచేయించుకుంటూ ప్రమాదాలకు గురి చేస్తుంటారని దివాకర్ ప్రమాదానికి కారణమైన ఏ.ఈ,కాంట్రక్టర్,లైన్‌మెన్‌లను సస్పెండ్ చేయాలని విద్యుత్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆలూరు డి.ఈ.ఈ.నాగేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా ప్రమాదంపై పోలీసులకు తెలిపామని భాదతుడిని బళ్లారికి వెళ్లి పరామర్శించామని నయం కావడానికి రెండు నెలల సమయం పట్టవచ్చని వైద్యులు తెలిపారని అన్నారు.అలాగే నిర్లక్ష్యంతో ప్రమాదానికి కారణమైన ఏ.ఈకి మెమో, లైన్‌మెన్ ను 15 రోజుల పాటు సస్పెండ్ చేశామని కాంట్రాక్టరుకు షోకాజ్ నోటీసు ఇచ్చామని తదుపరి ప్రమాదంపై ప్రభుత్వం విచారణ జరిపి సిఎండికి నివేదిక అందచేస్తారని వారు చర్యలు తీసుకుంటారని అన్నారు.

## భారత్‌ను సూపర్‌పవర్‌గా చేయడమే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** భారత్‌ను సూపర్‌పవర్‌గా చేయడమే బీజేపీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘువేంద్ర అన్నారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం గురువారం ముగిసింది. రాంబొట్ల దేవాలయం, సిల్వర్ జూబ్లీ కళాశాల, సీక్యాంపు సెంటర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరూరు రాఘువేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్‌లో అన్ని స్కామ్‌లేనని, బీజేపీలో అన్ని స్కీమ్‌లు అన్నారు. బీజేపీ పాలన అభివృద్ధి అన్నారు. బీజేపీ పాలనలో దేశంలోని ప్రజలు సుభిక్షంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు మాలతి, జయశ్రీయాదవ్, రాజేశ్వరి, శ్రీరాములుయాదవ్, రామాంజ నేయులు, లోకేశ్వరయ్య, భగత్, రాఘవేంద్ర, మధుగౌడ్, శివయ్యశెట్టి, శ్రీను పాల్గొన్నారు.

## ఆలూరు టికెట్ కోట్ల సుజాతమ్మకే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఉపసర్పంచ్ మేకల రంగన్న,

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఆలూరు నియోజకవర్గ టిడిపి టికెట్ ఇంచార్జి కోట్ల సుజాతమ్మకే ఇవ్వాలని ఆలూరు మండలం మొలగవల్లికి చెందిన ఉప సర్పంచ్ రంగన్న,వార్డు మెంబర్లు ఐకాంత్, ఉశేని, జలంధర్, దనుంజయలు కోరారు. ఈసందర్బంగా వారు టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ ఆలూరు టిడిపి టికెట్ ఐదు ఏళ్లుగా పార్టీకోసం కష్టపడ్డ సుజాతమ్మకే ఇవ్వాలని గత ఎంపిటిసి,సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిపించుకొని అబల కాదు సబల అని నిరూపించు కుందన్నారు.అలాగే ఆలూరు టికె ట్ ఇంచార్జిలను కాదని ప్రతి సారి కొత్తవారికి ఇవ్వడం వల్ల పార్టీ కార్యకర్తలు, నాయకుల మద్య సమన్వయం కొరవడి అభ్యర్థి ఓటమికి దారితీస్తుందన్నారు.గత 25ఏళ్లుగా ఆలూరులో టిడిపి జెండా ఎగుర వేయలేదంటే అది పార్టీ చేస్తున్న పొర పాట్లేనని అన్నారు.జనరల్ అయినప్పటి నుండి మొదట సిపిఐ,తర్వాత గౌడు,కోట్ల ఇలా ప్రతిసారి అభ్యర్థులను సర్వేల పేరిట మారుస్తున్నారని ఈ సారి జిల్లాలోనే డారింగ్ డేసింగ్ కలిగిన నాయకురాలు ఫైర్ బ్రాండ్ కోట్ల సుజాతమ్మకు టికె ట్ కేటాయించాలని గెలిచే సత్తా ఉన్న వారికి టికెట్ ఇవ్వాలని లేకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని వారు తెలిపారు.టిడిపి అధినేత చంద్రబాబు వేదావతి కోసం,ఎల్ఎల్‌సి కెనాల్‌లో నీటికోసం పోరాడిన కోట్ల సుజాతమ్మకే టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## వేసవిలో పంటలు వేసుకోవద్దు



**కోడుమూరు మేజర్ న్యూస్:** రైతులు వేసవిలో పంటలు వేయవద్దని అగ్రికల్చర్ అధికారి రవి ప్రకాష్ చెప్పారు. కోడుమూరు మండలం నందు పులకుర్తి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలను గురువారం పరిశీలించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకొని రైతులు వేసవిలో చేసుకోవలసినటువంటి వ్యవసాయ పనుల గురించి మరియు తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తలను తెలియజేయడం జరిగినది. అదేవిధంగా కులాలలో మిగిలిపోయినటువంటి గడ్డిని, మొక్కలను గట్టుపైన వేసి కాల్చి వేయవలెనని, పొలాలలో వాలుకు అడ్డంగా దుక్కి దున్నుకోవాలని, బోరు బాబుల కింద హంద్రీ కింద మార్చి ఏప్రిల్ నెలలో పంటలు వేయకూడదని తెలియజేశారు. అదికార్లు వివిఎలు కొండయ్య ,అంజలి, మరియు గ్రామ రైతులు కోట్ల రాముడు, హరినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తెలుగు పాపన్న మొదలగువారు పాల్గొనడం జరిగినది.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రజా పోరు యాత్రలో వివరిస్తున్న శబానా

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీశైలం నియోజకవర్గం ప్రజా పోరు యాత్ర కన్వీనర్ మెమిన్ శబానా, కో కన్వీనర్ చింతా నాగేశ్వర్‌రావులు తెలిపారు. గురువారం బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవలాపురం, చిన్నదేవలాపురం, నారాయణాపురం, సంతజూటూరు గ్రామాల్లో ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మెమిన్ శబానా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశ వ్యాప్తంగా మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి చేస్తూ ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ తమ ప్రభుత్వమే అందిస్తుందని తెలియజేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ పథకాలు అంటూ ప్రచారం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా పేదల పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం శ్రమిస్తుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ చింతా నాగేశ్వర్‌రావు, బండిఆత్మకూరు మండలం బీజేపీ అధ్యక్షులు బెస్త నాగరాజు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై సెక్టోరియల్ ఆఫీసర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై సెక్టోరియల్ ఆఫీసర్లకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదసున నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో ఇంతియాజ్ ఎన్నికల సెక్టోరియల్ ఆఫీసర్లకు ఈవీఎం పనితీరు, కౌంటింగ్ ఎలా తీసుకుంటుంది. సమస్యలు వస్తే ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్మరంలో సెక్టోరియల్ ఆఫీసర్లు హౌసింగ్ ఏఈ రామయ్య, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, వ్యవసాయాధికారి సుధాకర్, పంచాయతీ రాజ్ సుబ్బారెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ గౌస్, కానిస్టేబుల్ నజీర్‌అహ్మద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

## వాలంటీర్ల సేవలు అమోఘం

### ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వాలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్లు చేస్తున్న సేవల అమోఘమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వజ్రరత్న, మిత్ర అవార్డులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ ప్రవేశపెట్టిన వాలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శారద, పీఏసీఎస్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, మునిస్వామి, రమణారెడ్డి, మద్దిలేటి, పుసూలురు రామక్రిష్ణారెడ్డి, సత్యంరెడ్డి, మస్తాన్, హనుమంతరెడ్డి, సుంకన్న, వేణుగోపాల్‌రెడ్డి, అభి, బోయ రవి, ఈశ్వరయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న గౌరుచరితారెడ్డి

## తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది

### – పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ పరిధిలోని శ్రీరివాకుటీర్ ఇండిపెండెంట హౌసెస్‌లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి ఏపీకి ఎంతో కీలకమన్నారు. ప్రజల జీవితాలుల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి టీడీపీ, జనసేన కూటమి అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, 19వవార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రహ్మణపల్లె నాగ్గిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, వీరేంద్రకుమార్, టీడీపీ, జనసేన పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

### శ్రీశైలం నియోజకవర్గంలో

## టిడిపి జెండాను ఎగురవేద్దాం : బుడ్డా

### – సూపర్ 6 పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్దాం
### – రాష్ట్రంలో శ్రీశైలం నియోజకవర్గాన్ని ప్రత్యేక స్థానంలో ఉంచుదాం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌లో పొందుపరిచిన హామీలను ప్రతి గడపకు తాకేలా చేసి శ్రీశైలం నియోజకవర్గం గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని మాజి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో క్లస్టర్,యూనిట్, ఇన్చార్జిల సమావేశాన్ని బుడ్డా నిర్వహించారు. ఈ సందర్భంగా బుడ్డా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు శ్రీశైలం నియోజకవర్గంపై ఎంతో నమ్మకంతో ముందుగానే అభ్యర్థిని ప్రకటించడం సంతోషకరమని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్రీశైలం గడ్డంపై తెలుగుదేశం జెండాను ఎగురవేయాలని, అదే బాబుకు మనమిచ్చే కానుక అని అన్నారు. వైసిపి తప్పుడు ప్రచారాలను తిప్పి కొడుతూ బాబు పొందుపరిచిన సూపర్ 6 పథకాలను ప్రతి గడపకు తాకేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర భవిషత్‌కు గ్యారెంటీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోను త్వరలోనే చంద్రబాబు నాయుడు ప్రకటిస్తారని వాటిని ప్రజల్లోకి చేర్చి గెలుపే ధ్యేయంగా సైనికుల్లా పనిచేయాలని అన్నారు. శ్రీశైలం నియోజకవర్గం అంటేనే రాష్ట్రంలో ఓ ప్రత్యేకత ఉండేలా అత్యంత మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే పథకాలను రద్దు చేస్తారనే వైసిపి నాయకుల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొడుతూ అంతకు మించిన పథకాలను ప్రజలకు అందిస్తున్నామనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అన్నారు. ఎన్ని కుయుక్తులు పడినా, ఎంత అసత్య ప్రచారం చేసినా టిడిపి గెలుపును ఆపలేరని, రానున్న ఎన్నికల్లో టిడిపి అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన మూడు కుటుంబాలకు రూ.3 లోల చొప్పున ఆర్థిక సహాయాన్ని బుడ్డా అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బన్నూరు రామలింగారెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు వేణు, శివప్రసాద్‌రెడ్డి,అన్నారపు శేషిరెడ్డి, టిడిపి నాయకులు గోవింద రెడ్డి, బెంజిమెన్, నరసింహారెడ్డి, ఉల్లి మధు, మల్లీశ్వర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కలాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు

# ముస్తాబైన శ్రీశైలం

**శ్రీశైలం, మేజర్‌న్యూస్ :** ఇల కైలాసంగా శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరగనుంది. ఉదయం యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవ క్రతువులు ప్రారంభమవుతాయి. ఉదయం 8.46 గంటలకు యాగశాల ప్రవేశం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు సాయంకాలార్చనలు, అగ్నిప్రతిష్టాపన, అంకురార్పణ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు త్రిశూలపూజ, భేరిపూజ, సకల దేవతాహ్వానపూర్వక ధ్వజారోహణ, ధ్వజపట ఆవిష్కరణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి అయిన భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు,స్వామిఅమ్మవార్లకు వివిధ వాహనసేవలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పలు ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవాలయాలను వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వారిచే స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామిఅమ్మవార్లకు సమర్పిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో శ్రీశైల దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి లోటు రానివ్వకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని జాగ్రత్తలు చేపడుతున్నట్లు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు తెలిపారు.

**ముఖ్య కార్యక్రమాలు ఇలా..**

1వ తేదీన ధ్వజారోహణ, 2న బృంగి వాహన సేవ, 3న హంస వాహన సేవ, 4న మయూర వాహన సేవ, 5న రావణవాహన సేవ, 6న పుష్ప పల్లకి సేవ, 7న గజ వాహన సేవ, 8న మహా శివరాత్రి ప్రభోత్సవం- నంది వాహన సేవ, లింగోద్భవకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం-పాగాలంకరణ స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణం, 9న రథోత్సవం-తెప్పోత్సవం, 10న యాగ పూర్ణాహుతి, సదస్యం, నాగవల్లి,ఆస్థాన సేవ, ధ్వజావరోహణ, 11 న అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం.

**పట్టువస్త్రాల సమర్పణ**

1న శ్రీ కాళహస్తీశ్వరస్వామివార్ల దేవస్థానం, 2న శ్రీవేంకటేశ్వర స్వామివార్ల దేవస్థానం,ద్వారకా తిరుమల, 3న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం,ఇంద్రకీలాద్రి, విజయవాడ, 4న ఉదయం శ్రీవరసిద్ధివినాయకస్వామివార్ల దేవస్థానం-కాణిపాకం, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం, 5న రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు.

**ఆర్జితసేవలు, దర్శనములు**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా 11 రోజులు పాటు శ్రీశైల ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను పూర్తిగా నిలుపుదల చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే





భక్తులను అనుమతిస్తారు. కాగా జోతిర్ముడి కలిగియున్న శివదీక్షాభక్తులకు మాత్రం ఉత్సవాలలో 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు అయిదు రోజులపాటు నిర్దిష్ట వేళలో స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించారు. 5 వ తేదీ రాత్రి 7.30 గంటల నుండి 11వ తేదీ వరకు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలిపి వేయబడుతుంది.

**విరామదర్శనం**

ఉత్సవ రోజులలో 5వ తేదీ నుండి 11 వ తేదీ వరకు ప్రముఖులకు విరామ దర్శన వేళలో మాత్రమే దర్శనం కల్పించబడుతుంది. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ విరామ దర్శనం ఏర్పాటు చేయబడింది.మొదటి విడత :ఉదయం 6.30 ని.ల నుంచి 7.30ని.ల వరకు,రెండవ విడత :మధ్యాహ్నం 12.30 ని.ల నుంచి 1.00 ని.ల వరకు,మూడవ విడత :సాయంత్రం 7.00 ని.ల నుంచి 7.30 ని.ల వరకు.



**క్యూలైన్ల నిర్వహణ**

భక్తుల సౌకర్యార్థం మూడు క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరిగింది.ఉచితదర్శనం, శీఘ్రదర్శనం,అతి శీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఉచితదర్శన క్యూలైను రథశాల నుంచి ప్రారంభమవుతుంది. రథశాల వద్ద నుంచి క్యూలైన్లలో ప్రవేశించిన ఉచిత సర్వదర్శనం భక్తులకు క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయ ప్రవేశం కల్పించబడుతుంది. ఈ సర్వదర్శనం భక్తులకు క్యూ కాంప్లెక్స్ నందు వేచి వుండేందుకువీలుగా మొత్తం 17 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లను చేయడం జరిగింది. శీఘ్రదర్శనం(రుసుము రూ.200 క్యూలైను,అతి శీఘ్రదర్శనం (రుసుము రూ. 500/-లు) క్యూలైన్లు క్యాంపుకోర్టు భవనం ముందుభాగం నుంచి ప్రారంభమవుతాయి. ఈ క్యూలైన్ల ద్వారా వచ్చే భక్తులు వేచివుండేందుకు క్యూకాంప్లెక్స్ నందు మొత్తం 8 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లు చేశారు. వృద్ధులు,చంటిబిడ్డతల్లులు మరియు దివ్యాంగులకు కూడా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయబడింది.వీరిని మైక్ అనౌన్సుమెంట్ రూము ముందుభాగంలోగల దివ్యాంగుల క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. క్యూకాంప్లెక్స్ లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు అందించబడు తుంటాయి. అదేవిధంగా క్యూలైన్లలో కూడా భక్తులకు నిరంతరం మంచినీరు అందించబడుతుంది.

**శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్**

శివదీక్షను స్వీకరించిన దీక్షాభక్తులను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. ఆలయ ఉత్తరభాగంలోగల చంద్రవతి కల్యాణమండపం నుంచి ఈ క్యూలైన్ ప్రారంభించబడుతుంది. శివదీక్షా భక్తులు దర్శనానికి వేచివుండే విధంగా చంద్రవతి కల్యాణ మండపంలో మొత్తం 4 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. పాతాళగంగ రోడ్డు మార్గంలోని శివదీక్షా శిబిరాల వద్ద గత 28 నుంచి మార్చి 13వరకు జ్యోతిర్ముడి (ఇరుముడి)సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

**లడ్డు ప్రసాదాలు**

బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం 30 లక్షల లడ్డు ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళిక రూపొందించబడింది.మొత్తం 15 శాశ్వత కౌంటర్ల ద్వారా లడ్డుప్రసాదాలు అందజేయబడుతాయి. దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనం వద్ద 4 తాత్కాలిక కౌంటర్లు,గణేశ సదనం ఎదురుగా 2 తాత్కాలిక కౌంటర్ల ద్వారా లడ్డు ప్రసాదాలను విక్రయిస్తారు.

**మంచినీటి సదుపాయం**

బ్రహ్మోత్సవాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం నీటిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు రోజుకు 1,35,00,00 (30 లక్షల గ్యాలన్లు మంచినీరు, పలుచోట్ల గల 30 నీటి స్టోరేజ్ ట్యాంకులు, క్షేత్రపరిధిలో పలుచోట్ల గల 34 ఆర్.ఓ ప్లాంట్లు,క్షేత్ర పరిధిలో 450 మంచినీటి కుళాయిలను సిద్ధం చేశారు.

**అన్నప్రసాద వితరణ**

భక్తులు ఆలయ సమీపంలోగల (దేవస్థానం పరిపాలనా భవనం వెనుకభాగంలో)అన్నపూర్ణ భవనంలో అన్నప్రసాదాలను అందజేయబడుతాయి. బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక విధులు నిర్వహించే వివిధ శాఖల సిబ్బందికి, శివసేవకులకు (స్వచ్ఛంద సేవకులకు), ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరగు కళాకారులకు అన్నప్రసాద వితరణ భవనంలోనే అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేశారు.

**పుణ్య స్నానాలు ఏర్పాటు**

పాతాళగంగ వద్ద భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఏర్పాటు చేయబడ్డాయి. పాతాళగంగ నీటిమట్టం తగ్గుతున్న కారణంగా స్నానాలఘాట్ ఎగువ భాగంలో జల్లుస్నానానికి కూడా అవకాశం కల్పించబడింది. ఆలయ సమీపంలో (క్షత్రియ సత్రం దగ్గర) గంగాభవాని స్నానఘట్టాలలో కూడా భక్తులు స్నానాలాచరించవచ్చు. పలు ప్రదేశాలలో కూడా స్నానాలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించడం జరిగింది. పాతాళగంగ మార్గంలోని కల్యాణకట్ట, రాజులసత్రం దగ్గర, ఆర్.టి.సి.బస్టాండ్ వెనుక భాగంలో, శివదీక్షా శిబిరాల వద్ద దగ్గర, పాతాళగంగ మార్గంలోని డార్మెటరీల వెనుకభాగంలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర, చల్లా వెంకయ్య సత్రం ఎదురుగా (బసవవనంలో సిబ్బంది వసతి గృహాల వద్ద, యజ్ఞ వాటిక వద్ద వాహనాలు నిలుపు స్థలం (స్నానపు గదులు), గణేశసదనం ఎదురుగా (స్నానపు గదులు),వలయ రహదారిలో నక్షత్ర వనం ఎదురుగా (స్నానపు గదులు),గంగాభవానీ స్నానఘట్టాలకు ఎదురుగా (స్నానపు గదులు) మొత్తం 12 చోట్ల ఏర్పాటు చేశారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్**

అన్నదాన భవన సముదాయం వద్ద కమాండ్ కంట్రోల్ రూములో కంట్రోలింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూములో 18 ఎల్.ఈ.డి టీవీలు అందుబాటులో ఉన్నాయి.15 పి.టి.జెడ్ కెమెరాలు, 2 పీపుల్స్ కౌటింగు కెమెరాలు, 478 స్టాటిక్ సి.సి.కెమెరాలు, 3 వెహికల్ నెంబర్ ప్లేట్ డిటెక్టివ్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది.

**సాంస్కృతిక కార్యక్రమాలు**

ఆలయ పుష్కరిణి వద్ద గల భ్రామరీకళావేదిక,శివదీక్షా శిబిరాల వద్ద గల నటరాజ కళావేదిక మరియు ఆలయ మాడవీధిలోని నిత్యకళారాదన వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో పలు జానపద కళా రూపాలు ఏర్పాటు చేశారు.అలాగే క్షేత్ర పరిధిలో పలుచోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు భక్తులను స్వాగతిస్తూ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.క్షేత్ర పరిధిలో ఎటువంటి పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

సూర్య

శుక్రవారం 01 । మార్చి 2024

# బృందావనంలో 108వ శ్రీలక్ష్మి నారాయణ మహాయజ్ఞం



మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** సమాజంలో భక్తి భావనను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా కర్నూలు పట్టణంలో వెలసిన శ్రీ గోదాగోకులం నేతృత్వంలో ఈ భూమి మీద దేశ విదేశాల్లో వెలసిన 106 దివ్య క్షేత్రాలలో శ్రీ లక్ష్మినారాయణ మహాయజ్ఞాలు పూర్తి చేసుకొని, పాల కడలికి ప్రతీకగా 107వ శ్రీ లక్ష్మినారాయణ మహాయజ్ఞం పూరీ జగన్నాథ్ క్షేత్రంలో, పరమ పదానికి ప్రతీకగా 108వ శ్రీ లక్ష్మినారాయణ మహాయజ్ఞం పరవాసుదేవునికి వైకుంఠం కన్నా అత్యంత ప్రీతికరమైన, శ్రీకృష్ణ పరమాత్మ అవతరించి నడియాడి, అనేక లీలలు ప్రదర్శించిన బృందావనం క్షేత్రలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 1008మంది భక్తులతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 24న ప్రారంభమైన శ్రీలక్ష్మినారాయణ మహాయజ్ఞం 6రోజులపాటు శ్రీశ్రీశ్రీ త్రిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో చతుర్వేద పారాయణులైన ప్రధాన యాజ్ఞికులు శ్రీమాన్ సముద్రాల శ్రీమన్నారాయణాచార్యస్వామి నేతృత్వంలో యాజ్ఞిక బృందం మొదటి రోజు ఉదయం విష్వక్సేనేష్టి, సాయంత్రం అంకురార్పణ, రెండవరోజు సంతాన వేణుగోపాల హోమం, 3వరోజు వైభవేష్ఠి, 4వరోజు సుదర్శనేష్ఠి, 5వరోజు శ్రీలక్ష్మినారాయణేష్ఠి, 6వరోజు శ్రీసూక్త హోమం, మహాపూర్ణాహుతి, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి మాట్లాడుతూ సమాజంలో శాంతి సుస్థిరతలు ఏర్పడి, సనాతన ధర్మం వర్ధిల్లాల్లని అందరి హృదయాల్లో భక్తిచైతన్యం వెల్లి విరియాలనే ఏకైక సంకల్పంతో ఈ కార్యక్రమంలో 2014 సం వత్సరం ప్రారంభించడి నేటితో పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ ప్రపన్న రాఘవ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ పరమాత్మానంద గిరిస్వామి, శ్రీశ్రీశ్రీ అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్‌స్వామి, శ్రీలక్ష్మి నారాయణ మహాయజ్ఞం కార్యక్రమ నిర్వహకులు, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజుగుప్తా, ట్రస్టీ పల్లెర్ల నాగరాజుతోపాటు గోదాగోకులం పరివారం, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



ఆకట్టుకున్న కళా రూపం

# సమయ పాలన పాటించని మండల కార్యాలయ ఉద్యోగులు



రెవెన్యూ కార్యాలయం దృశ్యం

**వెల్దుర్తి ,మేజర్‌న్యూస్ :** రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది, అధికారులు గంటల తరబడి ఆలస్యంగా వస్తున్న పట్టించుకునే వారే లేరని రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదిదారులు విమర్శిస్తున్నారు. కార్యాలయంలో వీఆర్వోలు సమయానికి విధులకు ఆలస్యంగా వస్తుండడంతో కార్యాలయాల వద్దప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదని మండి పడుతున్నారు.గురువారం కార్యాలయానికి 11:30 గంటలు వరకు అధికారులు సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఖాళీగా కుర్చీలు, ఖాళీ కుర్చీలకు ఫ్యాన్లు వేసి కనిపిస్తూ దర్శనమిచ్చాయి. కార్యాలయంలో ఆర్ ఐ మస్తాన్, జూనియర్ అసిస్టెంట్ తప్ప ఇద్దరు మాత్రమే హాజరయ్యారు.ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారి సమస్యలు వినేవారు లేకపోవడంతో చేసేదేమీ లేక నిరుత్సాహంతో బాధితులు వెనుతిరుగుతున్నారు. సంబంధిత అధికారులు 11 గంటల వరకు కూడా ఆఫీస్కు రాకపోవడంతో వేచి చూసి విసుకు చెందామని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తిరిగిన కొన్ని పనులు కావడం లేదని, అధికారులు ఈ పేపరు, ఆ పేపరు మరికొన్ని దస్తావేజులు అంటూ దానికోసం దీనికోసం తిప్పుతూ సమయాన్ని వృధా చేస్తున్నారే తప్ప కావాల్సిన పనులను మాత్రం చేయడం లేదని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి మండల రెవెన్యూ కార్యాలయంలోనే కాక..మండల పరిషత్ కార్యాలయంలో కూడా కనిపిస్తుందని ,మండల పరిషత్ కార్యాలయంలో కూడా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అంటే ఈ రెండు శాఖల అధికారులు నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించి ,సమయపాలన పాటించని ఉద్యోగులను గుర్తించి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుకుంటున్నారు.

# చలువ పందిళ్లు ఏర్పాటు



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



రాజ్‌విహార్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని రాజ్‌విహార్, కలెక్టరేట్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది వేసవి సమయంలో రాజ్‌విహార్, కలెక్టరేట్ ప్రాం తాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ట్రాఫిక్‌లో సమస్యలు ఎండకు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ అధికారులు ఈ చలువపందిళ్లు ఏర్పాటు చేశారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పలువురికి ఆహ్వానం

**మహానంది, మేజర్‌న్యూస్ :**

మహానంది పుణ్యక్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పలువురు నాయకులకు, అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. గురువారం ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర్ అవధాని, ఏఈఓ వెంకటేశ్వర్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డికి, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డికి, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డికి, మున్సిపల్ కమీషనర్‌కు ఆహ్వాన పత్రికలను అందజేసి శివరాత్రి బ్రహ్మోత్సవాలలో స్వామి వార్ల దర్శనానికి రావాలని ఆహ్వానం అందించారు. అనంతరం స్వామి వారి తీర్ధప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనాలు అందించారు.

# నేటి నుంచి కార్డుదారులకు రూ.11లకే కేజీ రాగి పిండి

**– జేసీ నారపురెడ్డి మౌర్య**



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** జిల్లాలో నేటి నుంచి కార్డుదారులకు రూ.11 లకే కేజీ రాగిపిండి పంపిణీ చేయడం జరుగుతుందని జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేయనున్న రాగి పిండి పంపిణీ చేసే విషయంపై జేసీ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీ రాగి పిండిని రూ.11లకే ఎండియూ వాహనం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్‌లో కేజీ రాగిపిండి ధర రూ.40లు ఉందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కార్డుదారుల ఎంపిక ప్రకారం బియ్యంకు బదులుగా జొన్నలు /రాగులు అందజేయడం జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లాకు 6,76,209కార్డులకు గాను 11,857టన్నుల బియ్యం, 369టన్నుల చక్కెర, 676టన్నుల రాగిపిండి, 671టన్నుల జొన్నలు, 126 మెట్రిక్ టన్నుల రాగులు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో రైతుల దగ్గర నుంచి 850టన్నుల జొన్నలను పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. వంట గ్యాస్ పంపిణీ విషయంలో వినియోగదారుల నుంచి ఏజెంట్ కార్యాలయం నుంచి 15 కిలోమీటర్లలోపు ఉన్న వినియోగదారుల నుంచి ఎలాంటి రవాణా రుసుం వసూలు చేయరాదన్నారు. జిల్లాలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సివిల్ సప్లయ్ డీఎం షర్మి, డీఎస్ఓ కెవిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

# అమ్మా చల్లగా చూడవమ్మ

**– రమణీయంగా శ్రీరేణుక యల్లమ్మ రథోత్సవం – వేలాదిగా తరలివచ్చిన భక్తులు**



కన్నుల పండుగగా అమ్మవారి రథోత్సవం

**కోసిగి మేజర్ న్యూస్:** అమ్మా.. రేణుక యల్ల మ్మ చల్లనిచూపు చూ పించి ప్రశాంతంగా ప్రజలు ఉండే విధంగా నీచల్లని చూపు ఉండా లమ్మా.. ఉదోఉదో యల్లమ్మ అంటూ భక్తు లు రేణుక యల్లమ్మను ప్రార్థించారు. గురువారం శ్రీరేణుక యల్లమ్మ రథోత్సవం రమణీయ ంగా కన్నుల పండుగగా జరిగింది. ఉదయం తెల్లవారుజామునుండి అమ్మవారికి కుంకుమార్చ న, కలశాభిషేకం, మహామంగళారతి, ఆకుపూజ, గుగ్గిళ్ళు, కల్లు వంటి పూజలు నిర్వహించడం జరిగింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం దొరల ఇంటినుండి మురళీకృష్ణంరాజ్ దొర, శ్రీనివాసరాజ్‌దొర ఆధ్వర్యంలో కలశాలతో కుంభం ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించిన అనంతరం సాయంత్రం అమ్మవారి రథోత్సవంను లాగడం జరిగింది. ఈ రథోత్సవానికి వైకాపా నాయకులు ప్రదీప్‌రెడ్డి, మురళీరెడ్డి, తెలుగుదేశం నాయకులు పాల్గొనిఅమ్మవారిని దర్శించుకున్నారు.

**భారీ పోలీసుబందోబస్తు:** రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ ప్రసాద్ ఆధ్వర్యంలో డియస్పి సీతారాం, ట్రైనింగ్ డియస్పి సమక్షంలో భారీపోలీసుబందోబస్తు నిర్వహించారు. రథోత్సవంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా జరిగింది.

# నీటి సమస్య ఏర్పడకుండా కమిషనర్ ప్రత్యేక దృష్టి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** సుంకేసుల జలాశయంలో నీటి మట్టం అడుగంటడంతో నగర ప్రజలు తాగునీటిని ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నగర కమిషనర్ భార్గవతేజ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాంగా మూడురోజులపాటు నిర్విరామంగా 70కిలోమీట్ల మేర కెనాల్లోని అడ్డంకుల తొలగిస్తూ గాజులదిన్నె జలాశయం నుంచి మునగాలపాడు సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌కు నీటి ప్రవాహాన్ని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. జీడీపీ నుంచి విడుదల చేయించిన 30క్యాసెక్కుల నీటి ప్రవాహానికి గురువారం జి.సింగవరం వద్ద కమిషనర్ భార్గవతేజ పూజలు నిర్వహించి హారతినిచ్చి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈ జనార్ధన్, ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కమిషనర్ భార్గవతేజ